క్లుప్తంగా

'పల్లెపల్లెకు ఓబీసీ' పోస్టర్ ఆవిష్కరణ

పెంచికల్‌పేట్: 'పల్లెపల్లెకు ఓబీసీ ఇంటింటికి బీజేపీ' పోస్టర్‌ను ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చప్పిడే సత్యనారాయణ గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడి పాలనలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకుని రావడానికి కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఘనపురం నగేష్, పెద్ది సంతోష్, కుకిడే రాజేశ్వర్, కుకిడె వెంకన్న, డోకె నారాయణ, డోకె రాఘవులు, ఎల్లూరి శంకర్, కాటెల భీమయ్య, జునుగరి మధుకర్, పాగిడె అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన సదస్సు

కాగజ్‌నగర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 7500 ఉద్యోగాల భర్తీకి ఇటీవల స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ వెలువరించిన నేపథ్యంలో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉద్యోగాలపై గురువారం అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం తెలిపారు. సిలబస్, దరఖాస్తు ప్రక్రియ, ఎంపిక విధానం తదితర వాటిపై అవగాహన కల్పించారు.

'పది' పరీక్షలకు గట్టి బందోబస్తు

దహెగాం: పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ నేపథ్యంలో పది పరీక్షలు పటిష్టంగా నిర్వహించేందుకు గురువారం పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రానికి ఎవరు రాకుండా చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్‌లు, పోలీసులు పర్యవేక్షించారు.

వారసంత వేలం వాయిదా

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రతీ శనివారం కొనసాగే వారసంత వేలాన్ని నిర్ణీత ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఈవో కృష్ణమూర్తి తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని వారసంత వేలం కోసం ఇప్పటికే రెండుసార్లు వేలం నిర్వహించినా గ్రామపంచాయతీ నిర్ణయించిన ధర పలుకకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. తదుపరి వేలం తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

పంచముఖి ఆలయం ప్రారంభం



ఆలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని తారకరామానగర్‌లో కొత్తగా నిర్మించిన పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయాన్ని గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు వారికి సన్మానం చేశారు.

ఫీజు చెల్లించలేదని యూనిట్ టెస్ట్‌కు దూరం

కౌటాల: పాఠశాల ఫీజు చెల్లించలేదని విద్యార్థులను పాఠశాల యాజమాన్యం యూనిట్ టెస్ట్ పరీక్షలకు దూరంగా ఉంచిన ఘటన మండల కేంద్రంలోని ఇన్‌ఫంట్ జీసస్ ప్రైవేట్ పాఠశాలలో చోటు చేసుకుంది. రెండు నెలల నుంచి ఫీజు చెల్లించలేదని ఏడో తరగతికి చెందిన ఆరుగురు విద్యార్థులను గురువారం ప్రిన్సిపాల్ టామ్ విద్యార్థులను ఆరుబయట నిలబెట్టారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. ఎంఈవో సోమయ్య పాఠశాలను తనిఖీ చేసి విచారణ చేపట్టారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పేదలకు గురువారం మండల కేంద్రంలో దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో డీసీసీ విశ్వప్రసాద్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సుల్తాన్‌గూడకు చెందిన ఎక్బాల్, ఖాజా, చింతక్రకు చెందిన శ్యాంరావు, శంకర్, పాటాగూడకు చెందిన భరత్, భీంరావు కుటుంబాలకు బియ్యం, నూనె, పప్పుదినుసులు పంపిణీ చేశారు. నాయకులు భీంరావు, రోహిదాస్, సురేశ్, మధు, చిన్ను, శ్రీనివాస్, గిడ్డప్ప ఉన్నారు.

కార్యవర్గం ఎన్నిక

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయంలో గురువారం హిందూవాహిని కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర నాయకుడు ఆర్యన్, జిల్లా నాయకులు అశోక్, నాగ్‌రాజ్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా మండలి ఉమేశ్, దిలీప్, ఉపాధ్యక్షులుగా అనిల్, రాజు, కార్యవర్గ సభ్యులుగా సుభాశ్, రచిత్, క్రిష్ణ, కిరణ్, శ్రీకాంత్, అజయ్, నరేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



కౌటాల: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



రెబ్బెన: శోభాయాత్ర నిర్వహిస్తున్న హిందూ ఉత్సవ సమితి సభ్యులు



దహెగాం: హనుమాన్ శోభాయాత్రలో నృత్యం చేస్తున్న ప్రజలు

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సీఐ రాణాప్రతాప్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మజ్జిగ పంపిణీ ఏఎంసీ చైర్మన్ గాదెవేణి మల్లేశ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్‌నర్ రమేశ్, మాజీ ఏఎంసీ చైర్మన్ చిలువేరు వెంకన్న, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, ఇరుకుల్ల మంగ, ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, గుండ వెంకన్న, పిన్న వివేక్, గడ్డల వెంకన్న, ప్రకాశ్‌గౌడ్, రాజశేఖర్, మురళిగౌడ్, గాజుల సత్యనారాయణ, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

హనుమాన్ జయంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ ఆలయంలో వాసవి క్లబ్, పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా మజ్జిగ, చల్లటి నీరు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొలిప్యాక రవి, అభిలాష్, సాయిని శ్రీనివాస్, గంధం అముల్, గోగుల శ్రీనివాస్, పాత విశాల్, చెట్ల ప్రశాంత్, పద్మశాలి సంఘం ప్రతినిధులు చెన్నూరి అశోక్, జంజిరాల శ్రీనివాస్, కోశాధికారి రాజు, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, తిరుపతి, మహిళా అధ్యక్షురాలు విజయ, మంగ, జయగౌరి, భవాని, కోట వెంకన్న, కుమార్, రాంచందర్ పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతిని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని స్థానిక శివాలయం నుంచి పాత దహెగాంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో హనుమాన్ జయంతి పురస్కరించుకుని ఎల్కపల్లి హనుమాన్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను ఎల్కపల్లి, సంజీవనగర్, కొత్తగూడ గ్రామాల్లోని వీధుల గుండా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరై హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం జెడ్పీటీసీ సముద్రాల సరిత రాజన్న ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఆసిఫాబాద్ మండలంలో..

ఆసిఫాబాద్‌రూరల్: హనుమాన్ జయంతిని మండలంలోని మోతుగూడ, బూర్గుడ, గుండి, రాజుర, కేస్లాపూర్ గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలతో పాటు పతాకావిష్కరణ, తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఖాప్రిలో..

ఆసిఫాబాద్‌అర్బన్: హనుమాన్ జయంతి పురస్కరించుకొని గురువారం మండలంలోని ఖాప్రి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో కమిటీ సభ్యులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం పీఏసీఎస్ చైర్మన్ అలీబిన్ అహ్మద్ ఆధ్వర్యంలో అన్నదాన, ప్రసాద వితరణ చేశారు. గ్రామ పటేల్ బాలాజీ, విజయ్, రాజు, నీలకంఠరావ్, హరిచంద్, అంబారావ్, యశ్వంత్, నాగేష్, దుర్వరాజు, సోము, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, సీఈవో వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలో గురువారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని డబ్బా, రుద్రాపూర్, బాబాసాగర్, గంగాపూర్, కోర్సిని, ఖర్జెల్లి, చింతలమానెపల్లి గ్రామాలలోని హనుమాన్ ఆలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా భక్తుల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయకమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం హిందూ సేవా సమితి, తలోడి పవనసుత యూత్ ఆధ్వర్యంలో కౌటాలలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. భక్తులకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మజ్జిగ పంపిణీ చేశారు. బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు బిస్కెట్లు పంపిణీ చేశారు.

హనుమాన్ సేవ దళ్ ఆధ్వర్యంలో..

మండలంలోని ముత్తంపేట గ్రామంలో హనుమాన్ సేవ దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచులు వొజ్జల మౌనిక్, ఆదే శ్రీనివాస్, సొల్ల శంకరమ్మ, ఉప సర్పంచ్ తిరుపతి, వెంకటేశ్, బీఆర్‌ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సత్తయ్య, రవి, మధుకర్, విఠల్, దేవయ్య, శ్రీనివాస్, రమేష్, దత్తు, గట్టయ్య, బాపు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్, నంబాల, రెబ్బెనలలో గురువారం హనుమాన్ జయంతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని శ్రీ కోదండ రామాలయంలో హనుమాన్ భక్తులు 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయంలో ఉదయం హనుమాన్ మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. మండల కేంద్రంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించగా జై శ్రీరాం, జై హనుమాన్ నామస్మరణలతో మండల కేంద్రం మారోమోగింది.

కెరమెరిలో..

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయంతో పాటు సావర్‌ఖెడా, బాబేఝరి, అనారపల్లి, కెలికే, కెలిబి, సాంగ్వి, గోయగాం తదితర గ్రామాల్లో గురువారం ఘనంగా జయంతి నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న భక్తులు ఉదయాన్నే దేవాలయాలకు వెళ్లి అంజన్న ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశారు. కెరమెరి, బాబేఝరిలో అన్నదానం నిర్వహించారు.

వాంకిడిలో..

వాంకిడి: మండల కేంద్రంలోని హనుమాన్ మందిర్‌లో ఆంజనేయ స్వామి జయంతిని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే మండలంలోని భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాంకిడి సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై డి.సాగర్, స్థానిక సర్పంచ్ బండె తుకారాం, వ్యాపారవేత్త గాదె ప్రవీణ్ కుమార్, హనుమాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు ఎలుకపల్లి, చిన్న సిద్దాపూర్ తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో శోభాయాత్రలు నిర్వహించారు. అనంతరం ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.



ఆసిఫాబాద్: పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..



కౌటాల: రామాలయంలో భక్తుల పూజలు



రెబ్బెన: 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న స్వాములు



శోభాయాత్రలో నినాదాలు చేస్తున్న హరీశ్‌బాబు



చింతలమానెపల్లి: యాత్ర ప్రారంభిస్తున్న భక్తులు



ఆసిఫాబాద్‌అర్బన్: భోజనం వడ్డిస్తున్న అలీబిన్ అహ్మద్



ఆసిఫాబాద్‌రూరల్: జెండా ఆవిష్కరిస్తున్న భక్తులు



కెరమెరి: బాబేఝరిలో..



వాంకిడి: అన్నదానం నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాస్

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

దహెగాం: మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుందన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, మోర్చా అధ్యక్షుడు నారాయణ, నాయకులు సురేష్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌టౌన్: భారతీయ జనతా పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. స్థానిక ప్రజా కార్యాలయంలో బీజేపీ తాలుకా నాయకుడు డాక్టర్ హరీష్‌బాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పార్టీ జెండా ఆవిష్కరించారు.

వాంకిడిలో..

వాంకిడి: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ 43వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్ పార్టీ జెండా ఆవిష్కరించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నియంతృత్వ పాలనను అంతమొందించేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు.



కాగజ్‌నగర్‌టౌన్: పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

కౌటాలలో..

కౌటాల: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని పార్టీ మండలాధ్యక్షుడు నారులే వానుపటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయం ఎదుట భారతీయ జనతా పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్, నాయకులు బూర్ల రవీందర్, ఆదే చందు, ఎల్కులే మధుకర్, సుధాకర్, మనోజ్, భూమయ్య పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో

బెజ్జూర్: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు జాడి దిగంబర్ ఆధ్వర్యంలో గురువారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించి వేడుకలను జరుపుకున్నారు. బాలకృష్ణ, రామయ్య, సంజీవ్, శ్యాంసుందర్, మురళీగౌడ్, సంతోష్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

రెబ్బెన: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రెబ్బెన మండల కేంద్రంలోని కేకే గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి సింగరేణి ఉద్యోగులంతా హాజరై విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణరావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, కోనేరు కోనప్ప, కోవ లక్ష్మి, ఆత్రం సక్కులు హాజరవుతారన్నారు. ఏరియా మాజీ ఉపాధ్యక్షులు సదాశివ్, జీఎం కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, ఫిట్ కార్యదర్శి మహేష్, డిస్పెన్సరీ ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాస్‌రావు

నిజాయతీ చాటుకున్న ఆటో డ్రైవర్

ఆసిఫాబాద్‌రూరల్: రోడ్డుపై దొరికిన రూ.40 వేలను తిరిగి అప్పగించి ఆటో డ్రైవర్ సలీం తన నిజాయతీ చాటుకున్నారు. అందవెల్లి గ్రామానికి చెందిన పాండు తన బంధువులకు డబ్బులు ఇచ్చేందుకు గుండి గ్రామానికి వెళ్తున్న క్రమంలో తన జేబులోంచి డబ్బులు పోగొట్టుకున్నాడు. కాగా అటువైపు వెళ్తున్న ఆటో డ్రైవర్ సలీంకు ఆ డబ్బులు దొరికాయి. కాగా డబ్బులు ఎవరివో గుర్తించి అప్పగించాలని కోరుతూ నగదును గుండి గ్రామ సర్పంచ్‌కు సలీం ఇవ్వగా వాకబు చేసిన సర్పంచ్ డబ్బులను పాండుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్‌ను సర్పంచ్ అరుణ -రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ శాలువాలతో సన్మానించారు.

పాఠశాలలో పశు వైద్యశాల

- అసంపూర్తిగా నూతన భవనం
- 15 ఏళ్లు గడిచినా నిర్మాణం పూర్తికాని వైనం
- ఇన్‌చార్జి పశువైద్యాధికారే దిక్కు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



దహెగాంలో అసంపూర్తిగా పశువైద్యశాల భవనం



పాఠశాల భవనంలో కొనసాగుతున్న పశువైద్యశాల

దహెగాం: నిధులు మంజూరైనా అధికారుల అలసత్వంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. పర్యవేక్షణ లోపంతో దశాబ్దం క్రితం నిధులు మంజూరై, ప్రారంభమైన నిర్మాణాలు కూడా అసంపూర్తిగానే నిలిచిపోయాయి. దహెగాం మండల కేంద్రంలో 15 ఏళ్ల క్రితం ప్రారంభమైన పశువైద్యశాల భవన నిర్మాణం స్లాబ్ దశలోనే నిలిచిపోయినా పట్టించుకునే వారు కరువయ్యారు. పక్కా భవనం అందుబాటులో లేకపోవడంతో పశువైద్యశాల స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతోంది.

అసంపూర్తిగా భవనం..

దహెగాం మండల కేంద్రంలో పశువైద్యశాల భవనం నిర్మాణం కోసం 15 సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం ఆర్ఐడీఎఫ్ కింద రూ.16 లక్షలు మంజూరు చేసింది. మొదట్లో పనులు వేగంగా సాగినా స్లాబ్, గోడలు నిర్మించి వదిలేశారు. కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో పశువులకు వైద్యం అందని ద్రాక్షగానే మిగిలింది. పశువైద్యశాల భవనం అసంపూర్తిగా ఉండగా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

పాఠశాల భవనంలో పశువైద్యశాల..

మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక పాఠశాల భవనంలో పశువైద్యశాల కొనసాగుతోంది. ఒకే గది ఉండడంతో పశు వైద్యాధికారి ఉండే గదిలోనే పశువులకు సంబంధించిన మందులు ఉంచాల్సి న పరిస్థితి నెలకొందని సిబ్బంది పేర్కొంటున్నారు. గది కూడా ఇరుకుగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వాపోతున్నారు.

మండలంలో 37,742 పశువులు..

మండలంలో 37,742 పశువులు ఉన్నాయి. అందులో ఆవులు, ఎద్దులు 17055, గేదెలు 3,575, మేకలు 9,304, గొర్రెలు 2,808 ఉన్నాయి. వీటితో పాటు కోళ్లు 12,000, పందులు 34 ఉన్నాయని పశుసంవర్ధక శాఖ లెక్కలు చెబుతున్నాయి. మండల కేంద్రంతో పాటు, ఇట్యాల గ్రామంలో పశు వైద్యశాలలు ఉన్నాయి. రెండు పశువైద్యశాలలు ఉన్నా రెగ్యులర్ పశువైద్యాధికారి లేరు. తిర్యాణి మండలం గిన్నెధరి పశువైద్యాధికారి దహెగాం, ఇట్యాలకు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మండల కేంద్రంలో ఉన్న పశువైద్యశాల ప్రస్తుతం పాఠశాల భవనంలో కొనసాగుతోంది. 15 సంవత్సరాల క్రితం పక్కా భవనం అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మందులు, గడ్డి విత్తనాలు స్టోర్ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు అదనంగా నిధులు మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేయాలి.

– శ్రావణ్‌కుమార్, ఇన్‌చార్జి పశువైద్యాధికారి, దహెగాం

ఉత్తర్వులు నిలిపివేయాలి

చింతలమానెపల్లి(సిర్పూర్): పరీక్ష కేంద్రం నుంచి హిందీ పేపర్ బయటికి వచ్చిన ఘటనలో ఇన్విజిలేటర్లను ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేయాలని టీటీయూ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖమర్, కార్యదర్శి కలీముద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం వారు మాట్లాడారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రం నుంచి హిందీ పరీక్ష పేపర్ బయటికి వచ్చిన ఘటనలో ఇన్విజిలేటర్ సబియా ముదహద్ అనే ఉపాధ్యాయురాలిని ఉద్యోగం నుంచి తొలగించడం సరికాదన్నారు. ఈ ఘటనలో ఇన్విజిలేటర్ పాత్ర లేదని, భద్రతా వైఫల్యంతోనే అలా జరిగిందని పేర్కొన్నారు. గతంలో ఇలా సర్వీస్ నుంచి తొలగించిన ఘటనలు లేవని, అసమంజసమైన చర్యలతో ఇన్విజిలేటర్ విధులకు ఉద్యోగులు సాహసం చేయరని తెలిపారు. ప్రభుత్వం తిరిగి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.